గ్రామీణ ప్రాంత ఆవిష్కరణలు దేశ ప్రగతికి సోపానాలు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 30: గ్రామీణ ప్రాంత ఆవిష్కరణలు దేశ ప్రగతికి సోపానాలు అని కిట్స్ కళాశాల సెక్రటరీ, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ పేర్కొన్నారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ కళాశాలలో శనివారం డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ అధ్యక్షతన 'సామాజిక ఆవిష్కరణలు– సరళమైన జీవితం' అంశంపై జరిగిన అవగాహన సదస్సులో సతీశ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. గ్రామీణ విద్యార్థులు సాంకేతిక విద్యనభ్యసించడం వల్ల గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సదస్సులో టాస్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ సింహా, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్, హెడ్ హెల్డ్ హై స్వచ్ఛంద సంస్థ తరపున హాజరైన షికా టైలర్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ సెంటర్ కోఆర్డినేటర్ ప్రశాంత్ కుమార్, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ కోఆర్డినేటర్లు సృజన, వంశీకృష్ణ, అభిషేక్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, టాస్క్ అధికారి గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధమైన దత్తతే శ్రేయస్కరం

కలెక్టరేట్, నవంబర్ 30 : పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవడమే శ్రేయస్కరమని జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి అన్నారు. అంతర్జాతీయ దత్తత మాసాన్ని పురస్కరించుకుని, శనివారం నగరంలోని శిశుగృహలో నిర్వహించిన దత్తత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. దత్తత తీసుకోవాలనుకునే వారు కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం దత్తత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ ధనలక్ష్మి, విజయ్, రాధమ్మ, సీడీపీవోలు కస్తూరి, సబిత, సఖీ కేంద్రం నిర్వాహకురాలు లక్ష్మి, డీసీపీవో పర్వీన్, పీవోఐసీ శాంత, పీవోఎన్ఐసీ తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్ రాజేశ్, తదితరులు హాజరయ్యారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

తిమ్మాపూర్, నవంబర్ 30: పాలమూరులో నిర్వహిస్తున్న రైతుపండుగ వేడుకలను మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి రైతులతో కలిసి వీక్షించారు. మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వీడియోకాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సాయంత్రం సమయంలో వచ్చికొద్దిసేపు వీక్షించి వెళ్లారు. వ్యవసాయంలో టెక్నాలజీని పెంపొందించి లాభసాటి పంటల దిగుబడి పెంచి రైతుల జీవన విధానాన్ని మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏ నరేంద్ర శ్రీధర్, ఏవో సురేందర్, టెక్నికల్ ఏవో రమ్య, ఉద్యానవన శాఖ అధికారి రవళి, ఏఈవోలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, నవంబర్ 30: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున ఆదివారం నగరం, కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు లావణ్య, జీ రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

- ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు కార్పెంటర్ సొసైటీ, సంతోష్ మాతా హనుమాన్ టెంపుల్, పల్లవి చిల్డ్రన్ హాస్పిటల్, గీతాభవన్ వెనుక ప్రాంతం, న్యూ లేబర్ అడ్డ, భాగ్యనగర్, రాయల్ ఎలైట్ అపార్టుమెంట్ ప్రాంతాలు
- ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అలకాపురి, కోతిరాంపూర్ మెయిన్ రోడ్డు, జూస్ బేకరీ ఏరియా, గణేశ్ నగర్ బైపాస్, వసంత్ వ్యాలీ స్కూల్ ఏరియా
- ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు ఆసిఫ్ నగర్ ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- 52వ బాలల వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

కొత్తపల్లి, నవంబర్ 30 : విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కొత్తపల్లి(హవేలీ)లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 52వ బాలల జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రశ్నించడం అనేది విద్యార్థి దశలోనే అలవర్చుకున్నట్లయితే ఎన్నో శాస్త్రీయ ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు, అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అనంతరం శాసనమండలి సభ్యుడు కూర రఘోత్తమరెడ్డి మాట్లాడుతూ, వేల సంవత్సరాల క్రితమే భారత దేశం శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకెళ్తున్నదన్నారు. కొత్త కొత్త ఆవిష్కరణల నింటికీ మూలం భారతదేశమేనని తెలిపారు.

వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించి తిలకిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, డీఈవో సి.హెచ్.వి.ఎస్.జనార్దన్ రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, సెయింట్ జార్జ్ పాఠశాల చైర్మన్ డా. ఫాతిమారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి, డి.సి.ఇ.బి సెక్రటరీ మారం స్వదేశీ కుమార్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, కౌన్సిలర్ వేణుగోపాల్, మహ్మద్ అజీం, భగవంతయ్య, ఏనుగు ప్రభాకర్ రావు, కర్ర అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు స్పందన

సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లాలోని పాఠశాలల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఇందులో 624 ప్రదర్శనలు, ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ 2023–24 కోసం 147 ప్రదర్శనలు వచ్చాయి.

మరో రూ. 84.01 కోట్ల రుణమాఫీ

- 9,767 మంది రైతులకు వర్తింపు

కరీంనగర్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): జిల్లాకు నాలుగో విడుత రుణమాఫీ కింద 9,767 మంది రైతులకు రూ. 84 కోట్ల లక్షా 71 వేల 727 మంజూరైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. వీరంతా రూ. 2 లక్షల్లోపు రుణం ఉన్న రైతులేనని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే 3 విడుతల్లో 71,102 మంది రైతులకు రూ. 546.25 కోట్ల రుణమాఫీ జరిగినట్లు, ఐదో విడుత కింద మరికొందరు రైతులకు కూడా రుణమాఫీ వచ్చే అవకాశం ఉన్నట్లు ఆమె తెలిపారు.

వంతెనపై తాత్కాలిక మరమ్మతులు

రామడుగు, నవంబర్ 30 : మండల కేంద్రంలోని తాటివనం నుంచి షానగర్ వెళ్లేందుకు వాగుపై నిర్మించిన వంతెన గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో, కులవృత్తిలో భాగంగా తాటివనానికి వెళ్లే గీత కార్మికులతో పాటు పొలాలకు వెళ్లే రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. కాగా, గీతకార్మికులు, రైతుల బాధలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన, వంతెనపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీనిపై గీత కార్మికులు, రైతులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

శబరిమల చేరుకున్న గడప నాగరాజు బృందం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 30 : జిల్లా కేంద్రానికి చెందిన గడప నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో 140 మంది అయ్యప్ప స్వాములు కరీంనగర్ నుంచి శబరిమలకు మహా పాదయాత్రగా వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్వాముల బృందం శనివారం శబరిమల సన్నిధానం చేరుకుని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నది. ఈ యాత్ర 45 రోజుల పాటు 1400 కిలోమీటర్లు సాగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ పాదయాత్రలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా చెందిన డి సంపత్ గురుస్వామి, శ్రీకాంత్, ముఖేష్, నరేశ్, మధుసూదన్ రెడ్డి, కోటేశ్వరరావు, జగన్, రవీందర్, శివయ్య, వివిధ జిల్లాలకు చెందిన అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు సత్కారం

విద్యానగర్, నవంబర్ 30 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె. వెంకటరమణకు శనివారం తెలంగాణ వైద్య ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం హెచ్–1 యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏవో ఖాదర్, హెచ్ –1 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరగోని చంద్రమౌళి, రాష్ట్ర నాయకులు అష్టభ్ అహ్మద్‌ఖాన్, ఎన్ శ్రీనివాస్‌కర్ణ, జిల్లా నాయకులు బి. రోజ, ఎ. శ్రీనివాస్, లక్ష్మీరాజం, సంపత్, ప్రణీత, అరుణ, అజిజ్, వసంత తదితరులు పాల్గొన్నారు.

పారమితలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

కొత్తపల్లి, నవంబర్ 30 : స్థానిక మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవ సంబురాల్లో భాగంగా శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విజేతలకు విద్యా సంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డేకు మండల అధికారుల గైర్హాజర్

చిగురుమామిడి, నవంబర్ 30: ముదిమాణిక్యం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సమావేశానికి కేవలం రెవెన్యూ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ హాజరు కాగా, మిగతా శాఖల నుంచి మండల స్థాయి అధికారులు రాకపోవడంపై దళిత సంఘ నాయకుడు బోయిని రమేశ్ నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటివి మరోసారి పునరావృత్తం కాకుండా అధికారులు వ్యవహరించాలని కోరారు. సమావేశంలో అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు జేరిపోతుల శ్రీకాంత్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, గ్రామ నాయకులు బోయిని సురేశ్, జగన్, కుద్బుద్దిన్ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న బీఆర్ఎస్ నాయకులు

చొప్పదండి, నవంబర్ 30: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ శిక్షణ పాఠశాలను సందర్శించడానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, ఆర్నకొండ సింగిల్‌విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, నాయకులు కర్రె శ్రీనివాస్, మామిడి రాజేశం ఉన్నారు.

ప్రవీణ్ కుమార్‌పై మంత్రుల వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 30: ప్రభుత్వ గురుకుల పాఠశాలల విద్యార్థుల ప్రాణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని, వాటిని సక్రమంగా నిర్వహించే సత్తా లేక బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై రాష్ట్ర మంత్రులు అసత్యపు ఆరోపణలు చేయడం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత నెల రోజులుగా ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరుగుతుంటే ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. ఇకనైనా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై తప్పుడు ఆరోపణ చేయడం మానుకొని, విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని బండ శ్రీనివాస్ పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలి

కరీంనగర్ రూరల్, నవంబర్ 30: మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెలా రెగ్యులర్‌గా బిల్లులు చెల్లించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోలంపెల్లి ఆదర్శన్ రెడ్డి, గంప చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కరీంనగర్‌లోని యూనియన్ జిల్లా కార్యాలయంలో జరిగిన కరీంనగర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. బిల్లులు చెల్లించక పోవడం వల్లే మధ్యాహ్న భోజన కార్మికులు నాణ్యత పాటించడం లేదని, ఇది ప్రధానోపాధ్యాయులకు సమస్యగా మారిందన్నారు. అలాగే పాఠశాలల్లో స్కావెంజర్లకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు చిట్యాల ఈశ్వరయ్య, కొండ్ల మహేందర్, పోగుల ఆంజనేయులు, ఇన్నారెడ్డి, సుగుణాకర్‌రావు, రాజశేఖర్, విజయలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

రూర్బన్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఆర్డీవో

జమ్మికుంట, నవంబర్30: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకం కింద నిర్మించిన ఈజీఎంఎం శిక్షణ కేంద్రాన్ని, తదితర అభివృద్ధి పనులను శనివారం హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు పరిశీలించారు. రూర్బన్ పథకం కింద విడుదలైన నిధులు, జరిగిన పనులను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగుల స్వయం ఉపాధి కోసం ఈజీఎంఎం శిక్షణ కేంద్రం నిరుపయోగంగా ఉండటాన్ని ప్రశ్నించారు. అసంపూర్తిగా నిలిచి పోయిన పనులపై ఆరా తీశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ.. రూర్బన్ పథకం అభివృద్ధి పనులు, తదితరాల అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో భీమేశ్, తదితరులున్నారు.

జిల్లాకు నర్సింగ్ కళాశాల మంజూరు

విద్యానగర్, నవంబర్ 30 : జిల్లాకు ఎట్టకేలకు నర్సింగ్ కళాశాల మంజూరైంది. జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో ఓ అద్దె భవనంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 60 సీట్లతో మంజూరైన ఈ కళాశాలను ఈ నెల 2న వర్చువల్ పద్ధతిలో ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అన్ని సీట్లు భర్తీ అయినట్లు ప్రిన్సిపాల్ అనితాగ్రేస్ తెలిపారు. కొత్తపల్లిలో పక్కా భవనం నిర్మాణం జరిగే వరకు విద్యార్థులకు తరగతులు, వసతి ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. కాగా, కళాశాలకు ఒక్కరిని కూడా రెగ్యులర్ స్టాఫ్ కేటాయించకుండా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సహా ఫ్యాకల్టీస్ కూడా డిప్యూటేషన్‌పై నియమించడంతో తరగతుల నిర్వహణ ఎలా ఉంటుందోనని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మైనార్టీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, నవంబర్ 30 : విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే ఆసక్తి ఉన్న జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి బి.పవన్‌కుమార్ తెలిపారు. ఆగస్టు 1 నుంచి డిసెంబర్ 31,2024 మధ్య కాలంలో విదేశాల్లోని విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొంది ఉన్న వారు www.telanganaepass.cgg.gov.in లో దరఖాస్తు చేయాలని సూచించారు.

ఈడీని కలిసిన అద్దెబస్సుల యజమానుల సంఘం నాయకులు

ఈడీ ఖుస్రోషాఖాన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం నాయకులు

తెలంగాణచౌక్, నవంబర్ 30: కరీంనగర్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఖుస్రోషాఖాన్‌ను ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వర్ణ మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తమ్మల సుధీర్‌రెడ్డి బస్టాండ్ ఆవరణలోని ఈడీ కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పట్టణ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, నవంబర్ 30: టీజీ ఆర్టీసీ లాజిస్టిక్ హమాలీ సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని యూనియన్ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో శనివారం నిర్వహించిన రీజియన్ హమాలీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు న్యాయం చేయాలని, లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని పేర్కొన్నారు. ఇక్కడ ఆర్టీసీ రీజియన్ హమాలీ కార్యదర్శి కాళిదాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న, నాయకులు శ్రీనివాస్, సాయిలు, కొమురయ్య ఉన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా మిల్కూరి వాసుదేవ రెడ్డి

తెలంగాణచౌక్, నవంబర్ 30: సీపీఎం జిల్లా కార్యదర్శిగా మిల్కూరి వాసుదేవరెడ్డి ఎన్నికైనట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు టి.జ్యోతి తెలిపారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవనంలో రెండు రోజులుగా జరుగుతున్న పార్టీ జిల్లా మహాసభలు శనివారం ముగియగా, ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శితో పాటు కార్యదర్శి వర్గ సభ్యులుగా గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, బీమసాహెబ్ వీరితో పాటు జిల్లా కమిటీ సభ్యులుగా 15 మంది ఎన్నికయ్యారు.

కురుమ సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ

కార్పొరేషన్, నవంబర్ 30: కురుమ సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీని నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులుగా కడారి అయిలయ్య, బీర్ల బీరయ్య, ఎల్కపల్లి లచ్చయ్య, చేత్కురి రాములు, కర్రె ప్రవీణ్ కుమార్, యేగర్ల అశోక్, ఆగిత రవీందర్, కర్రె రాజు, జూలపల్లి రఘునందన్, ఏనుగుల రాజ కొమురయ్య, మ్యాకల నర్సయ్య, పోలే గట్టయ్య, బైరి మల్లయ్య, నీల పద్మ–కుమారస్వామి, పెద్ది రజిత భీమరాజును నియమించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 30: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 – 26 సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రచార పోస్టర్‌ను ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. అధ్యాపకులు ప్రభుత్వ కళాశాలల ప్రత్యేకతలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపక సంఘం శాతవాహన విశ్వవిద్యాలయం సమన్వయకర్త డాక్టర్ మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా దేవి, అధ్యాపకులు డాక్టర్ మహేశ్, డాక్టర్ మహిపాల్ రెడ్డి, లింగారెడ్డి, డాక్టర్ ఝాన్సీ రాణి, పల్లవి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం

చొప్పదండి, నవంబర్ 30: పట్టణాభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ పాలకవర్గం పనిచేస్తున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. శనివారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణంలోని సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మున్సిపల్ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. పట్టణంలోని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన కానిస్టేబుళ్లు

రాంనగర్, నవంబర్ 30: పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న వారిని జిల్లాలకు కేటాయించారు. ఇందులో భాగంగా 349 మంది కరీంనగర్ కమిషనరేట్‌కు చేరుకున్నారు. వీరిలో సివిల్ కానిస్టేబుళ్లు పురుషులు 150 మంది, మహిళలు 86 కాగా, ఏఆర్ కానిస్టేబుళ్లు పురుషులు 95 మంది, మహిళలు 18 మంది ఉన్నారు. వారు విధుల్లో చేరేందుకు శనివారం కమిషనరేట్‌లో హాజరయ్యారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కానిస్టేబుళకలకు సీపీ అభిషేక్ మొహంతి పలు సూచనలు చేశారు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. శనివారం సాయంత్రంలోగా విధిగా కేటాయించిన పోలీస్ స్టేషన్లలో విధుల్లో చేరాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మినారాయణ, ఏవో మునిరామయ్య, ఏసీపీలు శ్రీనివాస్, విజయకుమార్, ఆర్ ఐలు రజినీకాంత్, జానీమియా, కుమారస్వామి, శ్రీధర్ రెడ్డి, మినిస్టీరియల్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం

కమాన్‌చౌరస్తా/ వీణవంక/ రామడుగు, నవంబర్ 30 : గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థుల మృత్యువాతకు నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమయింది. ఈ సందర్భంగా నగరంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి నిధులు కేటాయించాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీణవంక మండల కేంద్రంలో పీడీఎస్‌యూ మండలాధ్యక్షుడు అంగిడి దేవేందర్ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలను మూసివేయించారు. కార్యక్రమంలో నాయకుడు బోగం అర్జున్ తదితరులు పాల్గొన్నారు. రామడుగు మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్‌స్కూల్, కేజీబీవీలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరగతులను నిలిపివేసి విద్యార్థులను పంపించివేశారు. ఇక్కడ ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బక్కశెట్టి హరీశ్, కేవీపీఎస్ మండల కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.

జాతీయ వేదికపై తాడిజెర్రి కళాకారుల ఒగ్గుడోలు ప్రదర్శన

గంగాధర, నవంబర్ 30: కేంద్ర ప్రభుత్వం, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం భవానిపాట్నా అంబేద్కర్ స్టేడియంలో నృత్య సంఘం–2024 జాతీయ గిరిజన సంప్రదాయ నృత్య మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహోత్సవంలో పాల్గొన్న మండలంలోని తాడిజెర్రి గ్రామానికి చెందిన మల్లికార్జున ఒగ్గుడోలు సేవా సమితి సభ్యులు గ్రామీణ కళారూపాలు ఒగ్గుడోలు, కోలాటం ప్రదర్శించారు. ఇక్కడ సంఘం అధ్యక్షుడు ఈర్ల మహిపాల్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్య

వీణవంక, నవంబర్ 30: బేతిగల్ గ్రామానికి చెందిన వేముల సిద్ధార్థ (21) పురుగుల మందుతాగి ఆత్మహత్య